
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

గురువారం 18 ఏప్రిల్ 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.158	230	262
సూర్యాపేట	రూ. 150	220	250
నల్లగొండ	రూ.158	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 42.5 । కనిష్ఠం 24.8

చూడముచ్చటగా సీతారాముల పరిణయం

జిల్లావ్యాప్తంగా వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

వేదమంత్రోచ్చరణలు.. మంగళవాయిద్యాలు.. గుండెల నిండా రామనామస్మరణతో జిల్లా మారుమోగింది. సకల గుణాభిరాముడు, సద్గుణవతి సీతాదేవి పరిణయ వేడుక బుధవారం చూడముచ్చటగా సాగింది. ముందుగానే అందంగా అలంకరించిన రామాలయాల్లో భక్తులకు ఏర్పాట్లు చేయడంతోపాటు కల్యాణవేదికలను ముస్తాబు చేశారు. క్రోధినామ సంవత్సర చైత్రశుద్ధ నవమి పునర్వసు నక్షత్రం, కర్కాటక రాశి, అభిజిత్ లగ్న సుముహూర్తమున స్వామివారు అమ్మవారి మెడలో మాంగళ్య దారణ చేశారు. ఎంతో ఆధ్యాత్మికతను నింపుకున్న ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా సంప్రదాయరీతిలో ఎదుర్కోలు ఉత్సవాలు నిర్వహించారు. అన్నదానం, ప్రసాద వితరణ చేశారు. రాత్రికి కల్యాణ మూర్తులను పల్లకిలో ఊరేగించారు. వేద పండితులు శ్రీరామ నవమి విశిష్టతను వివరించారు.

- భువనగిరి టౌన్

కమనీయం రమణీయం

రాములోరి కల్యాణం


చౌటుప్పల్ పట్టణంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు


ప్రత్యేక అలంకారంలో ఉత్సవమూర్తులు


భూదాన్‌పోచంపల్లిలో కల్యాణంలో పాల్గొన్న జడ్పీ వైస్ చైర్మన్ సందీప్ రెడ్డి


వలిగొండలో సీతారాముల కల్యాణంలోపాల్గొన్న భక్తులు

ఎన్నికల షెడ్యూల్

- ఈ నెల 18న నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ
- 25న నామినేషన్లకు చివరి గడువు
- 26న నామినేషన్ల పరిశీలన
- 29న నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు
- మే 13న పోలింగ్
- జూన్ 4న ఓట్ల లెక్కింపు



నామినేషన్ల స్వీకరణకు సిద్ధమైన కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల సమరం ప్రారంభంకానుంది. మైకుల మోతలు.. ప్రచార హోరుతో నామినేషన్ల పర్వం మొదలు కానుంది. ఇప్పటికే వేడెక్కిన వాతావరణం.. మరింత ఉద్విగ్నంగా మారనుంది. ప్రతిపక్షాల ఆరోపణలు.. అధికార పక్షం ఎదురు దాడులతో రసవత్తరం కానుంది. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో, నల్లగొండ పార్లమెంట్ స్థానానికి నల్లగొండ జిల్లాకేంద్రంలో నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇందుకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

సమరం షురూ

- నేడు లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్
- ఈ నెల 18 నుంచి 25వరకు నామినేషన్ల స్వీకరణ
- భువనగిరి కలెక్టరేట్ వద్ద ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 11 నుంచి 3గంటల వరకు

లోక్‌సభ నియోజకవర్గస్థాయిలో గురువారం నోటిఫికేషన్ జారీ చేసేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ మేరకు భువనగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే సంబంధిత అధికారులతో సమీక్షించారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, జనగామ జిల్లాల్లో విస్తరించి ఉంది. జిల్లాలోని భువనగిరి, ఆలేరు, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, జనగామ జిల్లాలోని జనగామ అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఈ నియోజకవర్గంలో 18 లక్షల మంది ఓటర్లున్నారు. భువనగిరి నియోజకవర్గం విస్తీర్ణంపరంగా పెద్దది కావడంలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆయా నియోజకవర్గాల్లోని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు(ఏఆర్వోలు), వివిధ శాఖల అధికారులతో ఎన్నికలపై సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి జిల్లాస్థాయిలో నోడల్ అధికారులను నియమించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించిన వారు ప్రస్తుతం ఏఆర్వోలుగా ఉంటారు. వీరికి ఎన్నికల నిర్వహణపై శిక్షణ పూర్తిచేశారు. నామినేషన్ల స్వీకరణ, ఎన్నికల కోడ్ అమలు,సీ-విజిల్,తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

పర్యవేక్షణ కట్టుదిట్టం

ఎన్నికలను సజావుగా పారదర్శకంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, అభ్యర్థుల ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కట్టుదిట్టంగా చేయించేందుకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్, వీడియో వ్యూయింగ్, మోడల్ కోడ్ అఫ్ కండక్ట్, సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీంలను ఏర్పాటుచేశారు. ఈ నియోజకవర్గంలో 2,141 పోలింగ్ కేంద్రా లు ఉన్నాయి. పోలింగ్ నిర్వహణ కోసం అవసరమైన పోలింగ్ అధికారు లు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులను గుర్తించారు. ఈ ఎన్నికల నిర్వహణకు మొత్తం పోలీసు సిబ్బందితో కలిపి 20వేలకు పైగా మంది విధులు నిర్వర్తించనున్నారు. పోలింగ్‌కు వినియోగించేందుకు ఈవీఎం ల పరిశీలన మొదటి దశ పూర్తయింది. అన్నిరాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. మరోసారి కూడా పరిశీలించనున్నారు.

భువనగిరి కలెక్టరేట్ వద్ద నామినేషన్ల స్వీకరణ

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల అధికారిగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే వ్యవహరిస్తున్నారు. అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ భువనగిరి మండలం రాయిగిరిలో గల కలెక్టరేట్‌లో ఉంటుంది. ఈ మేరకు కలెక్టరేట్ ఆవరణలో భద్రత కట్టుదిట్టం చేశారు. కలెక్టర్ కార్యాలయానికి 100 మీటర్ల దూరం వరకు మాత్రమే ర్యాలీకి అనుమతి ఉంటుంది. అభ్యర్థుల వెంట నలుగురిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతిస్తారు. అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఈ నెల 25న నామినేషన్లకు చివరి గడువు. అభ్యర్థితోపాటు ఐదుగురికి మాత్రమే నామినేషన్లు వేసే కార్యక్రమానికి అనుమతి ఉంటుంది. అదే విధంగా ఒక్కో అభ్యర్థికి మూడు వాహనాలకు మాత్రమే నామినేషన్లు వేసే ప్రాంతానికి అనుమతిస్తారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు సంబంధించి జనరల్ అభ్యర్థులు నామినేషన్ సందర్భంగా రూ.25వేలు డిపాజిట్ చేయాల్సి ఉండగా, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 చెల్లించాల్సి ఉంటుంది. నామినేషన్‌తోపాటు ఫాం-26 ద్వారా అఫిడవిట్ దాఖలు చేయాలి. నామినేషన్లు వేసే ప్రాంతంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

పారదర్శకంగా ఎన్నికలు

భువనగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే

యాదాద్రి: లోక్‌సభ ఎన్నికలను ప్రశాంత వాతావణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, నేడు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు భువనగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తామని, ఉదయం 11గంటల నుంచి 3గంటల సమయం వరకు ఉంటుందని తెలిపారు. సెలవుదినాల్లో నామినేషన్ల స్వీకరణ ఉండదని తెలిపారు. భువనగిరి లోక్‌సభ పరిధిలోని నియోజకవర్గాల్లో ఎస్ఎస్‌టీ, వీఎస్టీ, వీవీటీ, ఎఫ్ఎస్‌టీ టీములు 58 పనిచేస్తున్నాయని, 245 సెక్టార్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు బెన్ షాలోమ్, గంగాధర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరిలో మొత్తం 18,04,930 ఓటర్లు

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో 18,04,930 ఓటర్లు ఉన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు ఓటు నమోదుకు అవకాశం ఉండటంతో మరింత మంది ఓటర్లు పెరిగే అవకాశం ఉంది. నియోజకవర్గంలోని ఓటర్ల తుది జాబితాను జిల్లా యంత్రాంగం ఇటీవల ప్రకటించింది. భువనగిరి నియోజకవర్గంలో మొత్తం 18లక్షల మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 8,96,219, మహిళలు 9,08,632, ఇతరులు 79 మంది ఓటర్లు ఉన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలి

భువనగిరి అర్బన్: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఈసీ సమీక్షించి మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. బూత్‌లెవల్‌లో ఓటింగ్‌శాతం పెంచేలా సెక్టార్ అధికారులతో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్లు కూడా ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేసే విధంగా చర్యలు తీసుకోవడమేకాక అర్బన్ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు ఎన్నికల నిర్వహణపై హెల్ప్‌డెస్క్ ద్వారా వివరించాలన్నారు. ఈవీఎం రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులు పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వికాస్‌రాజ్

విద్యార్థి కుటుంబానికి..

న్యాయం చేయాలి

- రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలి
- గురుకుల పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా

భువనగిరి టౌన్, ఏప్రిల్ 17: కలుషిత ఆహారం తిని మృతి చెందిన విద్యార్థి చినలచ్చి ప్రశాంత్ కుటుంబానికి న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలో పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ పాఠశాల నిర్వహణలో లోపించిన ప్రమాణాలు, పర్యవేక్షణ ఫలితంగానే ప్రశాంత్ మృతి చెందాడని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు. ఇదిలా ఉంటే గురుకుల సొసైటీ ఆర్‌సీవో రజిని, డీఈవో డాక్టర్ కె.నారాయణరెడ్డి పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రమాణాల పెంపునకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా కలుషిత ఆహారం ఘటన కారకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ధర్నా చేయగా, వారికి తల్లిదండ్రులు మద్దతు తెలిపారు.


గాంధీ ఆస్పత్రి మార్చురీ వద్ద కుటుంబ సభ్యుల రోదనలు


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ప్రశాంత్‌ది ప్రభుత్వ హత్యే : బీజేపీ ఎస్సీ మోర్చా

కలుషిత ఆహారంతో మృతి చెందిన గురుకుల విద్యార్థి ప్రశాంత్‌ది ప్రభుత్వ హత్యేనని బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు ఆరోపించారు. ఈ మేరకు ప్రశాంత్ మృతికి సంతాపంగా బుధవారం భువనగిరిలో నివాళులర్పించారు. ప్రశాంత్ కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, కలుషిత ఆహార ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బుగ్గ దేవేందర్, పట్టణ అధ్యక్షుడు దాసరి స్వామి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మేడి కోటేష్, కోళ్ల భిక్షపతి, ఎర్రవెల్లి నాగరాజు, బరిగెల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, భట్టు రాంచంద్రయ్య, కర్తాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా

భువనగిరి అర్బన్: విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ఆరా తీసేందుకు అధికారులను నియమించినట్లు కలెక్టర్ హనుమంతు కే. జెండగే బుధవారం తెలిపారు. తుర్కపల్లి, భూదాన్‌పోచంపల్లి తహసీల్దార్లు దేశ్యా, శ్రీకాంత్‌రెడ్డి, భువనగిరి ఏరియా ఆస్పత్రి భువనగిరి తహసీల్దార్ అంజిరెడ్డిలను పర్యవేక్షణకు నియమించగా చికిత్స అందించేందుకు వైద్యాధికారులు డాక్టర్ విజయ్, యశోదలతోపాటు ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, హరిశంకర్ నిరంతరం పర్యవేక్షణ నిమిత్తం నియమించినట్లు తెలిపారు.

ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే ప్రశాంత్ మృతి: బీజేపీ

రామన్నపేట, అడ్డగూడూరు: ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రశాంత్ కలుషిత ఆహారం తిని మృతిచెందాడని బీజేపీ మండల అధ్యక్షుడు పలసు దుర్గయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రశాంత్ మృతికి కారణమైన హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని, ఫుడ్ కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేయాలన్నారు. అదే విధంగా అడ్డగూడూరులో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

మహోద్యమానికి పోచంపల్లి నాంది

- భూదాన్ ఉద్యమాన్ని ప్రారంభించిన వినోబాభావే
- నేడు భూదాన్ జయంతి ఉత్సవం

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 17: చారిత్రక మహోద్యమానికి భూదాన్‌పోచంపల్లి నాంది పలికింది. గాంధీజీ ఆశయాలు, సర్వోదయ సిద్ధాంతాలను ప్రచారం చేయడంకోసం ఆచార్య వినోబాభావే దేశమంతటా పాదయాత్ర చేయడానికి సిద్ధమయ్యారు. సర్వోదయ నాయకుడు శ్రీరామకృష్ణ దూత్ ఆహ్వానంమేరకు 1951 ఏప్రిల్ 15న హైదరాబాద్ సమీపంలోని శివరాంపల్లిలో నిర్వహించే సర్వోదయ సమ్మేళనంలో తన సందేశాన్ని ఇవ్వడానికి వచ్చారు. అప్పట్లో నల్లగొండ జిల్లాలో జరుగుతున్న రజాకార్ల దోపిడీలు, కల్లోల పరిస్థితులను తెలుసుకుని పరిష్కారమార్గాన్ని అన్వేషించడానికి వెంటనే పాదయాత్రగా బయలుదేరి 17వ తేదీన ప్రస్తుత పోచంపల్లికి వినోబాభావే చేరుకున్నారు. మరుసటి రోజు ఏప్రిల్ 18న ఎస్సీలతో సమావేశమయ్యారు. తమకు కొంత భూమి ఇస్తే సాగు చేసుకొని జీవిస్తామని వారు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎవరైనా భూమిని దానం చేసేవారున్నారా? అని వినోబాభావే ప్రశ్నించారు. అక్కడే ఉన్న వెదిరె రామచంద్రారెడ్డి వెంటనే లేచి 100 ఎకరాల సేద్యయోగ్యమైన భూమిని దానం చేస్తానని ప్రకటించి.., అక్కడికక్కడే దానపత్రాన్ని రాసి వినోబాభావేకు అందజేశారు. వెంటనే ఆ భూమిని వినోబాభావే పేదలకు పంచి భూదానోద్యమానికి బీజంవేశారు. ఇలా భూదానోద్యమానికి పోచంపల్లిలోనే అంకురార్పణ జరిగింది. ఇదిలా ఉంటే భూదాన్‌పోచంపల్లిలో నేడు భూదాన్ జయంతి ఉత్సవం నిర్వహించనున్నారు.


భూదాన్‌పోచంపల్లిలోని భూదాన్ యజ్ఞస్థూపం, వినోబామందిరం

వినోబా మందిరానికి ఆదరణ ఏదీ...?

పోచంపల్లిలో భూదానోద్యమ చారిత్రక నేపథ్యానికి స్మృతి చిహ్నంగా నిర్మించిన వినోబామందిరం నేటికీ ప్రారంభానికి నోచలేదు. స్మృతిచిహ్నం, వినోబామందిరం శిథిలం కాగా, 2012లో రూ.50లక్షలతో మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలో పట్టణంలో వినోబామందిరాన్ని పునర్నిర్మించారు. దాని పర్యవేక్షణ లేక ఎప్పుడూ తాళం వేసే కన్పిస్తోంది. అంతేగాక నిత్యం దేశ, విదేశాల నుంచి పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. అందులో నాటి భూదానోద్యమ చారిత్రక నేపథ్యాన్ని చాటేందుకు ఫొటోగ్యాలరీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. నేటికీ వినోబామందిరం ఆదరణ లేక వెలవెల పోతోంది.



ఎస్.. నేనే బాస్!

- తల్చుకున్నానంటే 120మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది అవుట్
- రెండు నెలల్లో ఇంటిబాట పట్టిస్తానంటూ డీసీసీబీలో ఓ అధికారి అల్టిమేటం
- వణికిపోతున్న చిరుద్యోగులు

నల్లగొండ, ఏప్రిల్ 17 : జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో చిరుద్యోగులు అభద్రతతో వణికిపోతున్నారు. ఉద్యోగం పర్మినెంట్ అవుతుందన్న ఆశతో ఉన్న వారిని ఉన్న ఉద్యోగం ఊడిపోతుందన్న భయం వెంటాడుతోంది. డీసీసీబీ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఆయా బ్రాంచ్‌లు, పీఏసీఎస్‌లు, జిల్లా కార్యాలయంలో 120మంది వరకు అవుట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్నారు. కొందరు 20 నుంచి 25 ఏళ్లుగా, మరికొందరు 10 నుంచి 12 ఏళ్లుగా, ఇంకొందరు 5 నుంచి 7 ఏళ్లుగా పనిచేస్తున్నారు. అయితే కొద్దిరోజులుగా వారికి ఉద్యోగ భద్రతపై నమ్మకం పోతోంది. పర్మినెంట్ కోసం గతంలో కొందరు కోర్టును ఆశ్రయించగా, మరికొందరు పాలకవర్గాలపై నమ్మకం పెట్టుకుని పనిచేసుకుంటూపోతున్నారు. అయితే పర్మినెంట్ ఏమోకాని ఉన్న ఉద్యోగం కూడా పోతుందన్న భయం వారిని నీడలా వెంటాడుతోంది.



రెండు నెలల్లో ఇంటికి వెళ్లిపోతారు

డీసీసీబీలోని ఓ ఉన్నతాధికారి తీసుకుంటున్న నిర్ణయాలు చిరుద్యోగులను హడలెత్తిస్తున్నాయి. రెండునెలల్లో అవుట్ సోర్సింగ్ సిబ్బందిని ఇంటిబాట పట్టిస్తానని అల్టిమేటం జారీ చేసినట్లు సమాచారం. డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డితో పాటు పాలకవర్గం అంతా అవుట్ సోర్సింగ్ సిబ్బందికి మద్దతు ఉండగా సదరు అధికారి మాత్రం ఆ సిబ్బందిని తొలగించి తీరుతానని భీష్మించినట్లు చర్చ సాగుతోంది. ఇటీవల జరిగిన ఎంసీ మీటింగ్‌లో అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించకూడదని పాలకవర్గం నిర్ణయించినట్లు సమాచారం. అయితే అవుట్ సోర్సింగ్ సిబ్బంది వల్ల ఖజానాకు నష్టం వాటిల్లుతోందని వారితో ఉపయోగం లేదన్న విధంగా ఆఅధికారి వితండవాదన చేయడం పాలకవర్గాన్ని సైతం ఆశ్చర్యాన్ని కలిగించినట్లు తెలిసింది. 107 ఏళ్ల బ్యాంకు చరిత్రలో రూ.2300కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది. దీంతోపాటు బ్యాంకు లాభాల బాటలో పయనిస్తున్న సమయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తానని చెప్పడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్న తలెత్తుతోంది.

పీఏ ద్వారా వెళ్లాల్సిందే

గతంలో లేని కొత్తవిధానం డీసీసీబీలో నడుస్తోందని వాపోతున్నారు. డీసీసీబీ, జిల్లా కార్యాలయంతోపాటు పీఏసీఎస్ సీఈవోలు, బ్రాంచీల మేనేజర్లు, ఉన్నతాధికారులు సైతం ఆసార్‌ను కలవాలన్నా, ఫైళ్ల పరిశీలన జరగాలన్నా పీఏ ద్వారానే అన్న పరిస్థితి ఏర్పడింది. డీసీసీబీలో గతంలో పనిచేసిన ఏ ఉన్నతాధికారి వారి ఛాంబర్ల వద్ద అటెండర్‌కు మించి ఉద్యోగి ఉండరు. ఈయనమాత్రం ప్రత్యేకంగా ఓ పీఏనే నియమించుకున్నారు.

సిబ్బంది తొలగింపుపై నిర్ణయం జరగలేదు

అవుట్ సోర్సింగ్ సిబ్బంది తొలగింపు విషయం కొన్ని రోజుల క్రితం పాలకవర్గ మీటింగ్‌లో చర్చించిన విషయం వాస్తవమే. అయితే వారిని తొలగించ కూడదని, ప్రస్తుతానికి నిర్ణయించాం.

శంకర్‌రావు, సీఈవో, డీసీసీబీ, నల్లగొండ

22క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

డిండి, ఏప్రిల్ 17: వాహనంలో తరలిస్తున్న 22క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నల్లగొండ జిల్లా డిండి మండలంలోని చెర్కుపల్లి స్టేజీవద్ద అధికారులు బుధవారం పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని బొలెరో వాహనంలో తరలిస్తున్నారన్న సమాచారంతో డీటీసీఎస్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ చెర్కుపల్లి స్టేజీవద్ద స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. బియ్యం తరలిస్తున్న చందంపేట మండలం నల్లచలమూల గ్రామానికి చెందిన ముత్యాలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. చందంపేట మండలంలో సేకరించిన రేషన్ బియ్యాన్ని వాహనంలో డిండి మండలంలోని రైస్‌మిల్లుకు తరలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



చెర్కుపల్లి స్టేజీవద్ద పోలీస్, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

శేశిలేటివాగులో మంటలు

గుర్రంపోడు, ఏప్రిల్ 17: నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలోని శేశిలేటివాగులో బుధవారం సాయంత్రం మంటలు దట్టంగా వ్యాపించాయి. గుర్తుతెలియని వ్యక్తులు మంట పెట్టి ఉంటారని అనుమానిస్తున్నారు. శేశిలేటివాగులో జమ్ము ఉండడంతో పశువులు, మేకలు మేసేందుకు వీలు లేకుండా ఉంది. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు జమ్మును తొలగించేందుకు నిప్పు పెట్టి ఉంటారని భావిస్తున్నారు. వాగులో మంటలు వ్యాపించడంతో రైతులకు సంబంధించిన పైపులు, మోటార్లు, విద్యుత్ వైర్లు దగ్ధమైనట్లు తెలిసింది. మంటలు వ్యాపించడంతో ప్రజలు ఎవరూ అక్కడికి వెళ్లడం లేదు. స్థానికులు అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం ఇచ్చారు. నల్లగొండ నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అర్పుతున్నారు.



శేశిలేటివాగులో ఎగిసిపడుతున్న మంటలు

గుట్టలో వైభవంగా సీతారాముల కల్యాణం

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 17: యాదగిరిక్షేత్రంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి అనుబంధ శివాలయంలో ఈ నెల 9 నుంచి చేపట్టిన వసంతోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం సీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. కల్యాణతంతులో భాగంగా నిత్యారాధనల అనంతరం అభిషేకం, ఆధ్యాత్మిక రామాయణ పారాయణం, స్వామిఅమ్మవార్లకు అష్టోత్తర శత నామార్చనలు చేశారు. వేదపండితులు, పురోహితులు వేదమంత్రోచ్చరణల నడుమ మంగళవాయిద్యాలు మార్మోగుతుండగా స్వామిఅమ్మవార్లను వజ్ర వైఢూర్యాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠించి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. రాత్రి వేళ హనుమాన్‌మూర్తులకు సహస్ర నామార్చనలు, నివేదన నీరాజనం, మంత్ర పుష్పాలు, వేదపండితులు, పురోహితులు, అర్చకులు తీర్థప్రసాద వితరణ చేయగా కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి దంపతులు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో దూశెట్టి కృష్ణ, పర్యవేక్షకుడు రామారావు, పూజారి దోర్బల శ్రీధరశర్మ, ఉద్యోగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యకైంకర్యాలు భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చన చేశారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్దారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరుకల్యాణపర్వాలు ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన అర్చకులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు చేశారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వైభవంగా జరిగాయి. అదేవిధంగా కొండపై శివాలయంలో శ్రీపర్వతవర్థిని సమేత రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.12,15,058 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి
కేసీఆర్ అభినందన



మహేందర్‌రెడ్డిని అభినందిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

యాదగిరిగుట్ట రూరల్, నల్లగొండ, ఏప్రిల్ 17: అప్పుల్లో ఉన్న ఉమ్మడి నల్లగొండ డీసీసీ బ్యాంకును లాభాల్లోకి తెచ్చిన డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిని మాజీ సీఎం కేసీఆర్ అభినందించారు. ఆయన హైదరాబాద్‌లో కేసీఆర్‌ను బుధవారం కలిశారు. దేశంలోని 540 డీసీసీబీల్లో ఉత్తమ అవార్డుకు ఎంపికైన ఐదుగురిలో మహేందర్‌రెడ్డి ఒకరు కావడం రాష్ట్రానికే గర్వ కారణమని కేసీఆర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మదర్ డెయిరీ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి, యాదాద్రిభువనగిరి జిల్లాకు చెందిన సింగిల్ విండో చైర్మన్లు మొరిగాడి మల్లేశంగౌడ్, ఎన్. పరమేశ్వర్‌రెడ్డి, రాంరెడ్డి, దామోదర్‌రెడ్డి, గూదె బాలనర్సయ్య, ఎస్. నర్సింహారెడ్డి, చింతలపురి భాస్కర్‌రెడ్డి, జంగారెడ్డి, భూపాల్‌రెడ్డి, గుండాల వైస్ చైర్మన్ పురుగుల మల్లేశయాదవ్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

తిప్పర్తి, ఏప్రిల్ 17: అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం పోలీసులు బుధవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సర్వారం గ్రామానికి చెందిన గంట నాగరాజు గ్రామంలోని తన కిరాణ దుకాణంతో పాటు బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో విక్రయించడానికి అనుమతి లేనందున దుకాణంలో ఉన్న 43మద్యం క్వాటర్లు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. సీజ్ చేసిన మద్యం విలువ సుమారు రూ.8వేల వరకు ఉంటుందని తెలిపారు.



భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యుటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

పులకించిన భద్రగిరి

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



స్వామివారి ఊరేగింపు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



మాదిగలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తోంది

● **మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు**



మాట్లాడుతున్న నర్సింహులు

భువనగిరి రూరల్, ఏప్రిల్ 17: మాదిగలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తోందని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మా జాతి హక్కులు మాకు కల్పించడం లేదు' అని మంద కృష్ణ మాదిగ మాట్లాడిన దాంట్లో తప్పు లేదన్నారు. కడియం శ్రీహరిది ఏ కులమో ఆయనకే తెలియదన్నారు. మాదిగలకు జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ టికెట్లు కేటాయించాలని కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశామన్నారు. తెలంగాణలో దాదాపు 80లక్షల మంది మాదిగల జనాభా ఉన్నప్పటికీ ఆ జనాభాకంటే తక్కువ శాతం ఉన్న ఇతర కేటగిరీ కులస్థులకు ఒక్క ఇంటిలో ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ఆ కుటుంబంలోనే మరో వ్యక్తికి ఎంపీ టికెట్ కేటాయించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్పించిన హక్కులను కాలరాస్తూ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ లమనే తమ కులస్థులకు ఇప్పటివరకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా ముఖం చాటేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికీ కాంగ్రెస్ పార్టీ నుంచి మారే ఉద్దేశం లేదని, మాదిగలకు జరుగుతున్న అన్యాయం, హక్కుల సాధనకు గురువారం బేగంపేటలోని లీలానగర్‌లో తన ఇంటి వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరసన దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఈ దీక్షకు మేధావి వర్గం ప్రజాస్వామ్య వాదులు, ప్రజా సంఘాలు, ఎమ్మార్పీఎస్ నేతలు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం తెలపాలని కోరారు.

అనారోగ్యంతో యువతి ఆత్మహత్య



కనగల్, ఏప్రిల్ 17: అనారోగ్యంతో బాధపడుతున్న యువతి మనస్తాపంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలం పర్వతగిరి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ రామకృష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెనగాని క్రిష్టయ్య, లక్ష్మమ్మ దంపతుల చిన్న కూతురు కావ్య(20) కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతోంది. ఎన్ని మందులు వాడినా వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొద్దిసేపటి తర్వాత ఇది గమనించిన కుటుంబసభ్యులు కావ్యను కిందికి దించి చికిత్స నిమిత్తం నల్లగొండ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెం దింది. కావ్య తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కావ్య హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతూ వారం రోజుల క్రితం గ్రామానికి వచ్చిందని స్థానికులు తెలిపారు.

కారు ఇంజన్‌లో మంటలు



మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 17: అధిక ఉష్ణోగ్రతల కారణంగా వాహనం ఇంజన్ వేడెక్కి మంటలు చెలరేగాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని అశోక్‌నగర్‌లో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం యాదాద్రి పవర్‌ప్లాంట్ నిర్మాణ సంస్థకు చెందిన టీఎస్ 05యూఈ 4865 నెంబర్ గల వాహనం అశోక్‌నగర్‌లో రోడ్డుపై వెళ్తున్న క్రమంలో ఆకస్మాత్తుగా ఇంజన్‌లో మంటలు వ్యాపించాయి. గమనించిన కారు డ్రైవర్ అప్రమత్తమై వాహనాన్ని నిలిపి వేశాడు. అప్పటికే ఇంజన్‌లో మంటలు వ్యాప్తించి కాలిపోతుండగా స్థానికుల సాయంతో సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపుచేశారు. బొలేరో వాహనంలో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. అధిక ఉష్ణోగ్రతతో ఇంజన్ వేడెక్కడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ...



యాదయ్య(ఫైల్)

చిట్యాల రూరల్, ఏప్రిల్ 17: అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తూ ఒకరు అనంతలోకాలకు వెళ్లారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో బుధవారం జరిగింది. చిట్యాల ఎస్ఐ సైదబాబు తెలిసిన వివరాల ప్రకారం.. మండలంలోని పేరేపల్లికి చెందిన రూసని యాదయ్య(58) చిట్యాల పరిధిలో శివనేనిగూడెంలో తన బంధువు మృతి చెందగా అంత్యక్రియలకు వెళ్లి తన స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. వెలిమినేడు శివారులో జాతీయ రహదారి దశమి ల్యాబ్ ఎదురుగా యాదయ్య బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో యాదయ్య తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. యాదయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండకు తరలించారు.

పాఠశాల ఆవరణలో ..

గుండాల, ఏప్రిల్, 17: యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం రాత్రి పూజలు చేసిన ఆనవాళ్లు కన్పించాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం పాఠశాలలో వాకింగ్ వెళ్లిన గ్రామస్థులకు పాఠశాల ఎదుట ఉన్న స్టేజీపైన పూజలు చేసినట్లు ఆనవాళ్లు కన్పించడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ యాకన్న సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ఆకతాయిలు చేసిన పని అని తెలిపారు.

బ్యాంకు క్యాష్ ఇన్‌చార్జిపై ఫిర్యాదు

వలిగొండ, ఏప్రిల్ 17: బ్యాంక్‌లో నగదు కొరత కారణంగా బ్యాంక్ క్యాష్ ఇన్‌చార్జిపై బ్రాంచి మేనేజర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) వలిగొండ బ్రాంచిలో క్యాష్ ఇన్‌చార్జిగా పని చేస్తున్న కాలేరు అనిల్‌కుమార్ ఏప్రిల్ 16వ తేదీ నుంచి విధులకు గైర్హాజరవుతున్నాడు. బుధవారం వరకు బ్యాంక్‌కు హాజరుకాకపోవడంతో బ్రాంచి మేనేజర్ సిబ్బందితో కలిసి అతని క్యాష్ క్యాబిన్‌ను తనిఖీ చేయగా రూ.15,50,000 నగదు కొరత కనిపించింది. పరారీలో ఉన్న ఉద్యోగి అనిల్‌కుమార్‌పై బ్రాంచి మేనేజర్ మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

రాజాపేట, ఏప్రిల్ 17: విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం కాల్వపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన కాకర్ల చంద్రకళ (55) బుధవారం ఇంట్లో నీళ్ల కోసం విద్యుత్ మోటార్ స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతంతో మృతిచెందింది. మోటార్ వైరు తేలి ఉండడంతో విద్యుదాఘానికి గురైంది. చంద్రకళకు భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రూ.75,800 నగదు పట్టివేత

తిరుమలగిరి, ఏప్రిల్ 17: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలోని ఈదులపర్రెతండాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద రూ. 75,800ల నగదును పోలీసులు బుధవారం పట్టుకున్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా కారులో తరలిస్తున్న ఈ నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



చౌటుప్పల్‌లో సీతారాముల కల్యాణోత్సవంలో కన్యాదానం చేస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి- లక్ష్మి దంపతులు

- జగమంతా వేడుక..ఊరంతా సందడి
- వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు
- అధిక సంఖ్యలో హాజరైన ప్రజలు



అడ్డగూడూరు: ఎమ్మెల్యే సామేల్‌కు శ్రీరాముడి చిత్రపటం అందజేస్తున్న నిర్వాహకులు

శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణం జగమంతా వేడుకగా..ఊరంతా సందడిగా సాగింది. జిల్లా వ్యాప్తంగా కల్యాణం కమనీయంగా సాగింది. ఆయా పట్టణాలు, గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పెళ్లి పెద్దలుగా కల్యాణంలో పాల్గొనగా, అర్చకులు పెళ్లితంతును సాగించారు. అందరికీ అన్నప్రసాదం, పానకం అందజేశారు.

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: శ్రీరామ నవమి వేడుకలను జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. భువనగిరి పట్టణం, మండలంలోని పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు ఎడ్ల వెంకటరెడ్డి దంపతులు, రేకల శ్రీనివాస్ దంపతులు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, ఎంపీటీసీ ఉడుత శారదాఆంజనేయులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

● బీబీనగర్ పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో జరిగిన వేడుకలకు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి కుమార్తె కుంభం కీర్తిరెడ్డి, రాఘవాపురంలో జరిగిన వేడుకకు జడ్పీచైర్మన్ మాజీ కసిరెడ్డి నారాయణ రెడ్డి హాజరు కాగా పట్టణంలోని పంచముఖి ఆలయంలో సీతారాముల కల్యాణమహోత్సవానికి జడ్పీటీసీ దంపతులు గోళి ప్రణీత పింగల్ రెడ్డి హాజరయ్యారు. భక్తుల సౌకర్యార్థం బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు పీవీ శ్యాంసుందర్ రావు, జడ్పీటీసీ దంపతులు వేర్వేరుగా అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

● భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని శివారెడ్డిగూడెం గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో, కనుముకుల పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని సీతారామచంద్ర స్వామివారి కల్యాణోత్సవానికి ముఖ్యఅతిథిగా జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి హాజరైనారు. ఈ ఉత్సవాల్లో శివారెడ్డిగూడెం ఆలయం నిర్మాణ వ్యవస్థాపకులు మేకల రామకృష్ణారెడ్డి, నాయకులు కోట మల్లారెడ్డి, పగిల్ల రాంరెడ్డి, మేకల దేవేందర్‌రెడ్డి, మేకల సత్తిరెడ్డి, వారాల రామచంద్రారెడ్డి, వారాల వెంకట్‌రెడ్డి, వారాల విష్ణువర్ధన్‌రెడ్డి, పీసర్ల మంజుల మహిపాల్‌రెడ్డి, నారి రాజేందర్, ఉప్పునూతల వెంకటేష్‌యాదవ్, మేకల సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కనుముకుల దేవాలయంలోని ఉత్సవాల్లో ఆలయ నిర్మాణకర్తలు, జడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి, పాక నర్సింహయాదవ్ పాల్గొన్నారు.

● వలిగొండ పట్టణం, మండలంలోని గోకారం గ్రామ పరిధిలో చింతబండపైన కొలువుదీరిన స్వయంభూ శ్రీ సీతా రామ చంద్ర స్వామి కల్యాణం వైభవంగా సాగింది. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. సంగెం, వర్కట్‌పల్లి ఆలయాల్లో జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. మండలంలోని వెంకటాపురం గ్రామ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం గుట్టపైన, సంగెం, వర్కట్‌పల్లి, వెల్వర్తి, దాసిరెడ్డిగూడెం, మల్లేపల్లి, దుప్పల్లి, చిత్తాపురం, నాతాళ్లగూడెం, అక్కంపల్లి, గ్రామాల్లో స్వామివారి కల్యాణం జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్‌రాజు, వైస్‌ఎంపీపీ బాతరాజు ఉమా బాలనర్సింహ, పీఏసీఎస్ చైర్మన్ సురకంటి వెంకట్‌రెడ్డి, నాయకులు కుంభం విద్యాసాగర్‌రెడ్డి, నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

● చౌటుప్పల్ పట్టణంలో సీతారాముల కల్యాణాన్ని దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి- లక్ష్మి దంపతులు కన్యాదాన కార్యక్రమంలో పాల్గొని, వేదపండితుల ఆశీర్వాదాన్ని పొందారు. అనంతరం భక్తులకు రాజగోపాల్ రెడ్డి దంపతులు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ఆదర్శమూర్తులు సీతారాముల ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, కరువు కాటకాలనుంచి ప్రజలకు విముక్తి లభిస్తుందని వారు ఆకాంక్షించారు. రాత్రి సీతారాముల ఉత్సవ విగ్రహాలతో శోభయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, దేవస్థాన కమిటీ చైర్మన్ బొబ్బిళ్ల మురళి, డైరెక్టర్ గుర్రం వెంకటేశ్, కామిశెట్టి చంద్రశేఖర్, పోలోజు శ్రీలత శ్రీనివాస్, తూర్పాటి నర్సింహ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్, మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, జిల్లా రైస్ మిల్లుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మంచికంటి భాస్కర్ గుప్త, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్, రాజీవ్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఆర్. మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ సుర్వి నర్సింహగౌడ్, గ్రంథాలయ మాజీ చైర్మన్ మల్లేష్ పాల్గొన్నారు. చౌటుప్పల్ మండలంలోని దేవలమ్మనాగారంలో జరిగిన కల్యాణంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

● సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలోని రామాలయంలో సీతారాముల కల్యాణ వేడుకలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దంపతులు, కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు భక్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు. లచ్చమ్మగూడెంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి అయిలయ్య పాల్గొన్నారు.

● యాదగిరిగుట్ట పట్టణ, మండలంలోని ఆయా దేవాలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మాసాయిపేట పాల సంఘం చైర్మన్ ఇంటేరు ఇంద్రసేనారెడ్డి, మాజీ సర్పంచ్ ఒంటేరు సువర్ణాఇంద్రసేనారెడి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు ఒంటేరు సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

● మోత్కూరు మునిసిపాలిటీ, అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో సీతారామచంద్రుల కల్యాణం నిర్వహించారు. మోత్కూరులో మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి, కొండగడపలో గ్రీన్ లైన్ యూపీవీసీ విండోస్ అండ్ డోర్స్ యజమానులు కరుణమల్లేష్ స్వామివారి కల్యాణం సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పించారు. అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. మోత్కూరులో ముస్లిం సోదరులు అహమ్మద్, జానీ భక్తులకు శీతల పానీయం అందించారు. ఆలయాల్లో పూజారులు కొండగడప హరీష్‌శర్మ, పారునంది నూరిబాబుశర్మ, పారునంది లక్ష్మణమూర్తి, హరిబాబుశర్మ, ప్రదీప్‌శర్మ, శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

● అడ్డగూడూరు మండలంలోని బొడ్డుగూడెం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే మందుల సామేల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోలెబోయిన లింగయ్య యాదవ్, నాయకులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

● గుండాల మండలంలోని సీతారాంపురంలో కల్యాణానికి వివిధ గ్రామాల నుండి భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ జాలిగామ చలపతిరావ్, పూజారి వేణుగోపాలాచార్యులు గ్రామస్తులు మలిపెద్ది సంతోష్‌రెడ్డి, జోగు శ్రీశైలం, మలిపెద్ది సోమిరెడ్డి, బొడిగ యాదగిరి, వలందాసు ప్రభాకర్, మలిపెద్ది సత్తిరెడ్డి పాల్గొన్నారు.

● మోటకొండూర్ మండల వ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల్లో హనుమాన్ యూత్ అధ్యక్షుడు రేగు ఉపేందర్, కొరటికంటి వినోద్ లాస్య, ఎగ్గిడి కృష్ణ పుష్పా, ఉప్పలంచి బాలరాం మమత, రేగు నాగరాజు లావణ్య, వడ్డేబోయిన పాండు, రేగు చంద్రయ్య, నాగరాజు పాల్గొన్నారు.

● ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ఉత్సవ దాత మురారిశెట్టి కిషన్ దంపతులు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. పారుపల్లిలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య దంపతులు పాల్గొన్నారు. ఆలయ కమిటీల చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

● రామన్నపేట మండల కేంద్రంతో పాటు మండలంలోని వెల్లంకి, సిరిపురం, సూరారం, ఎన్నారం, కక్కిరేణి, గ్రామాలతోపాటు అన్ని గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలను నిర్వహించారు. నాయకులు గంగుల వెంకటరాజిరెడ్డి, పూస బాలకిషన్, ఎడ్ల మహేందర్‌రెడ్డి, తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వలిగొండలో కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి దంపతులు



తుర్కపల్లిలో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



రాముడి వేషధారణలో బాలుడు, పారుపల్లిలో పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బిక్షమయ్యగౌడ్

● తుర్కపల్లి మండల కేంద్రంలోని రాములగుట్ట పైన, సీతారామంజనేయ స్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని వేర్వేరుగా నిర్వహించారు. తుర్కపల్లి, వాసాలమర్రి, రామపురం గ్రామాల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ పాల్గొన్నారు. ఆయన వెంట రాష్ట్ర నాయకులు పడాల శ్రీనివాస్, దాసరి మల్లేశం, నాయకులు బానోతు చత్రునాయక్, లక్ష్మీనారాయణ న్నారు.

● ఆలేరు మండలం సాయిగూడెంలోని రామాలయంలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఊట్కూరి సురేష్‌గౌడ్, నిఖిల్‌రెడ్డి, భక్తులు ఉన్నారు. కాగా ఆలేరులో శివాలయంతో పాటు గొనుకొండ, శారాజీపేట, సాయిగూడెం, కొలనుపాక ఆలయాల్లో వేడుకలను నిర్వహించారు.

● రాజాపేట మండలంలోని రాజాపేట, బొందుగుల, రఘునాథపురం, బేగంపేట, చల్లూరు, కుర్రారం తదితర గ్రామాల్లో నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



సాయిగూడెంలో పూజలోపాల్గొన్న ప్రభుత్వ విప్ అయిలయ్య దంపతులు



ఆత్మకూరు(ఎం) : పూజలో పాల్గొన్న ప్రజలు



మోత్కూరులో తాళిబొట్టును చూపుతున్న అర్చకుడు



పోచంపల్లిలో తాళిబొట్టును చూపుతున్న అర్చకుడు



యాదగిరిగుట్ట రూరల్: మాసాయిపేటలో కళ్యాణంలో పాల్గొన్న ఇంద్రసేనారెడ్డి సువర్ణ దంపతులు

ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉంది

● ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్



భువనగిరిటౌన్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్

భువనగిరి టౌన్, ఏప్రిల్ 17: ఎస్సీ వర్గీకరణకు ప్రధాని నరేంద్రమోదీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు ఇచ్చిన హామీపై బీజేపీ కట్టుబడి ఉందని పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. బుధవారం భువనగిరిలో నిర్వహించిన పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ ఎస్సీ మోర్చా, ఎమ్మార్పీఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. మాదిగలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై స్పష్టమైన అవగాహన ఉన్నందునే వర్గీకరణ బిల్లుకు చట్టబద్దత కల్పించేందుకు హైదరాబాద్‌లో జరిగిన మాదిగల విశ్వరూప మహాసభలో ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చారని అన్నారు. ఇచ్చిన హామీని మూడోసారి కొలువుదీరనున్న బీజేపీ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని ఎమ్మార్పీఎస్ బలపర్చాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాశం భాస్కర్, చందా మహేందర్‌గుప్త, ఎస్సీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరెకంటి మొగులయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడి కోటేష్, బోసుపల్లి ప్రతాప్, జిల్లా అధ్యక్షులు బుగ్గ దేవేందర్, కోళ్ల భిక్షపతి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ పాల్గొన్నారు.

అడ్డగూడూరు: అభివృద్ధి కోసం ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని తుంగతుర్తి బీజేపీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ కూరాకుల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం అడ్డగూడూరు మండల కేంద్రంలో 54,56,58 బూత్‌లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భువనగిరి భాజపా ఎంపీ అభ్యర్థి డాక్టరు బూర నర్సయ్య గౌడ్‌ను గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు ఏనుగు బీరుమల్లు, ఓబీసీ మోర్చ అధ్యక్షుడు మరాఠీ కూమారు, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు శంకర్ రెడ్డి, కూరకుల అరుణా, కొత్తోజ్ నవీన్, కూరకుల యాదగిరి ఉన్నారు.

మోత్కూరు : పార్లమెంటు ఎన్నికల్లో భువనగిరి ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు పోచం సోమయ్య కోరారు. బుధవారం మోత్కూరులోని పలు కాలనీల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దొంతి నర్సింహారెడ్డి, ఏనుగు జితేందర్‌రెడ్డి, చేకూరి మల్లేష్, ఆరె శ్రీనివాస్, ముత్తినేని తిరుమలేష్, సజ్జనం మనోహర్, యాకేష్, ప్రకాష్, రమణ, దశరథ, మాసిరెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.



మోత్కూరులో ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మంత్రి ప్రభాకర్‌ను విమర్శించడం సిగ్గుచేటు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 17: మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బీజేపీ నాయకులు విమర్శించడం సిగ్గుచేటని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. యాదగిరిగుట్టలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి రాజకీయాల నుంచి తెలంగాణ కోసం పార్లమెంట్‌లో పోరాడిన బీసీ నాయకుడు పొన్నం ప్రభాకర్ అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో సేవలు అందిస్తున్న మంత్రిని విమర్శించడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతీ గ్రామంలో అందరికీ ఉపాధి కల్పించిందని గుర్తుచేశారు. అన్ని రాష్ట్రాల్లో కులగణనకు ఆమోదం తెలిపిందన్నారు. ఐదు గ్యారెంటీలు, 25 న్యాయాలతో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రకటించి అన్ని వర్గాలకు సమన్యాయం చేసేందుకు కృషి చేస్తోందన్నారు. జన్‌ధన్ ఖాతాల్లో ప్రతీ ఒక్కరి అకౌంట్లలో రూ.15 లక్షలు జమ చేస్తామని మోసం చేసిన బీజేపీ దేశాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టి ఆదానీ, అంబానీలకు ఊడిగం చేస్తోందన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి యువతను మోసం చేసిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు గుండ్లపల్లి వాణిభరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేశ్‌యాదవ్, పటణ అధ్యక్షుడు భిక్షపతిగౌడ్, హేమేందర్ గౌడ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం రోడ్‌షోను విజయవంతం చేయాలి

● జిల్లా కమిటీ సభ్యుడు వనం ఉపేందర్

రామన్న పేట, ఏప్రిల్ 17: సీపీఎం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి ఎండి.జహంగీర్ నామినేషన్ సందర్భంగా భువనగిరి జిల్లా కేంద్రంలో ఈ నెల 19న నిర్వహిస్తున్న రోడ్ షో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు వనం ఉపేందర్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కక్కిరేణి గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించి మాట్లాడారు. సీపీఎం అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి, పార్లమెంట్‌కు పంపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు వేముల సైదులు, శాఖ కార్యదర్శి కన్నెబోయిన యాదయ్య, ఎన్‌పిఆర్‌డి జిల్లా నాయకులు పిట్ట శ్రీనివాస్‌రెడ్డి, కన్నెబోయిన మంగమ్మ, మంజుల, రాములు పాల్గొన్నారు.



కక్కిరేణిలో ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు ఉపేందర్, సైదులు

మోత్కూరు : పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించి, నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే సీపీఎం అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను భువనగిరి ఎంపీ స్థానానికి గెలిపించాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పాలడుగు గ్రామంలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దడిపెల్లి ప్రభాకర్, పిట్టల చంద్రయ్య, సోమరాజు, లక్ష్మణ్, యాదయ్య, అనసూర్య, బుచ్చిరాములు, నర్సమ్మ, మాధవి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.



మోత్కూరు మండలం పాలడుగులో ప్రచారంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

కాంగ్రెస్ పథకాలతో ప్రజలకు లబ్ధి



ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

చౌటుప్పల్ టౌన్/ చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 17: భువనగిరి పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడం తథ్యమని కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జ్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఆందోళ్ మైసమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ సిద్దిపేట శేఖర్‌రెడ్డి, రామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ సుంకరి సత్యనారాయణ, రెడ్డి సంఘం అధ్యక్షుడు తుంగ భూపాల్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు దౌడి వెంకటేశ్, గుండ్ల అనిల్, సుంకరి రమేష్, ఎం.శంకరయ్య, ఇ.హరిప్రసాద్ ఉన్నారు. కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్, బ్లాక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, దేవేందర్ పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివిపెట్టిన కుమార్తె



తండ్రికి అంతిమసంస్కారం నిర్వహిస్తున్న పెద్దకుమార్తె భవాని, పాల్గొన్న రమ్య

ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 17: కుమారులు లేకపోవడంతో కుమార్తె తండ్రికి తలకొరివి పెట్టింది. మండలంలోని కప్రాయిపల్లి గ్రామంలో కొడిమాల సత్తయ్య(55)అనే వ్యక్తి బుధవారం గుండె పోటుతో మృతిచెందాడు. అతనికి కుమారులు లేనందున కుమార్తెలే తండ్రికి తలకొరివి పెట్టారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొడిమాల సత్తయ్య రోజూ కట్టెకొట్టే పనికి కూలికి వెళ్లేవాడు. అతనికి భవాని, రమ్య అనే ఇద్దరు కుమార్తెలు ఉండగా భవానికి వివాహం చేశాడు. చిన్న కుమార్తె డిగ్రీ చదువుకుంటోంది. సత్తయ్య భార్య అనారోగ్యంతో గత ఏడాది మృతిచెందింది. రోజూ మాదిరిగానే మంగళవారం పనికి వెళ్లివచ్చిన సత్తయ్య భోజనం చేసి, ఇంటి ఎదుట మంచంలో నిద్రించాడు. చిన్న కుమార్తె గ్రామంలో ఉన్న అమ్మమ్మ ఇంట్లో నిద్రించింది. బుధవారం తెల్లవారుజామున రమ్య ఇంటికి వచ్చి తండ్రిని నిద్రలేపబోగా అతను అప్పటికే మృతిచెందాడు. సత్తయ్య గుండె పోటుతో చనిపోయినట్లు గ్రామస్థులు గుర్తించారు. సత్తయ్య దహన సంస్కారాలకు పెద్ద కుమార్తె భవాని తండ్రికి ముందు నడిచి తలకొరివి పెట్టింది. తల్లిని, తండ్రిని కోల్పోయి అనాథలైన అక్కాచెల్లెళ్ల పరిస్థితిచూసి ప్రతీ ఒక్కరు కంట తడిపెట్టారు.